క్లుప్తంగా

22 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు


అలంకరణలో కాల్వేపల్లి రంగనాథస్వామి

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో వెలసిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న గణపతి పూజ, స్వస్తివాచన, పుణ్యాహ్, దేవనాంది, రక్షబంధన, కలశ స్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణతో పాటు అదేరోజు రాత్రికి లక్ష్మీదేవి సమేత రంగనాథస్వామి వారికి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 23న బ్రహ్మరథోత్సవం, అన్నదానం, 24న వసంతోత్సవం, 101 ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

7,066 మందికి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

అమరాపురం: మండలంలో గతేడాది వేరుశనగ, కంది పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసినట్లు మండల వ్యవసాయాధికారి మంజునాథ తెలిపారు. మండలంలో 7066 మంది రైతులు వివిధ పంటలను సాగుచేశారని, అయితే అకాల వర్షం కారణంగా పంటలు పండలేదన్నారు. దీంతో మండలానికి రూ.5 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించిన పోలీసులు

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం మూడు ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్నారు. పరిగి మండలం నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను సీజ్ చేశారు. నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


బోయ తిప్పేస్వామి (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లి గ్రామానికి చెందిన బోయ తిప్పేస్వామి వారం రోజుల క్రితం అదృశ్యమైనట్లు ఆయన సోదరుడు తిమ్మన్న తెలిపారు. తిప్పేస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ నెల 12వ తేదీ ఆదివారం సాయంత్రం వరకూ గ్రామంలోనే ఉన్నాడన్నారు. అయితే రాత్రి ఇంటి నుంచి ఉన్న ఫళంగా ఎటో వెళ్లి పోయాడన్నారు. రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9032671407 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని అప్పుడే వ్యాధిని అరికట్టవచ్చనని ఫోర్డ్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అశ్వత్థనారాయణ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు.

ఘనంగా వాసవీ జయంతి


కలశాలతో యువతులు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆర్య వైశ్య యువతుల భరత నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే పుణ్య కోటి నాటకం అలరించింది.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

మడకశిరరూరల్: మండలంలో ఈఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో 400 ఎకరాల్లో వివిధ రకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. రైతులు సాగు చేసిన మొక్కలను సంరక్షించుకోవడానికి రైతుకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం మూడు సంవత్సరాలు బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులు మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముంగారుకు సిద్ధం !

- మడకశిర నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు
- ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడీతో విత్తనాల పంపిణీకి రంగం సిద్ధం
- విత్తనాల కోసం ఆర్బీకేల్లో రైతుల పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం
- వ్యవసాయ పనులపై దృష్టిసారించిన అన్నదాతలు


వేరుశనగ సాగు చేసే భూమిని ట్రాక్టర్‌తో సిద్ధం చేసుకుంటున్న రైతు

మడకశిర: నియోజకవర్గంలో గత మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతన్నలు ముంగారు వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో రైతులు వివిధ పంటలను సాగు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా మడకశిర వ్యవసాయ డివిజన్‌లో మడకశిర రూరల్, మడకశిర అర్బన్, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో రైతులు ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 30 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు అయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది కూడా అదేస్థాయిలో వేరుశనగ పంట సాగయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు పడుతుండడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు.

విత్తన కాయల కోసం ప్రతిపాదనలు

నియోజకవర్గవ్యాప్తంగా ఈఏడాది ఖరీఫ్‌లో రైతులకు 26,750 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు అవసరమవుతాయి. ఈ మేరకు స్థానిక వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సబ్సిడీతో ప్రభుత్వం ఈవిత్తనాలను పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. అలాగే 220 క్వింటాళ్ల కంది విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. రాగి విత్తనాలను కూడా సబ్సిడీతో అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. 5 మండలాలకు 25 క్వింటాళ్ల రాగి విత్తనాల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కే 6 రకం వేరుశనగ విత్తనం పంపిణీ

నియోజకవర్గవ్యాప్తంగా ఈ ఏడాది రైతులకు కే-6 రకం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఈరకం వేరుశనగ పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు పూర్తి స్థాయిలో కే-6రకం వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేయనున్నారు. అదే విధంగా ఎల్‌ఆర్‌జీ 41 రకం కంది విత్తనాలను రైతులకు అందించనున్నారు.

ఆర్బీకేలకు చేరుతున్న విత్తన కాయలు

రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా వేరుశనగ,కంది విత్తనాలను ఆర్బీకేలకు చేరవేయడానికి చర్యలు చేపట్టింది. ఈసీ కూడా విత్తనాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో విత్తనాల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. కొన్ని చోట్ల పేర్ల నమోదు ప్రక్రియను కూడా అధికారులు ప్రారంభించారు.

సబ్సిడీ వేరుశనగ, కంది విత్తనాలకు ప్రతిపాదనలు ఇలా..		
మండలం	వేరుశనగ (క్వింటాళ్లలో..)	కంది (క్వింటాళ్లలో..)
మడకశిర	7,000	50
అమరాపురం	7,000	50
గుడిబండ	6,000	50
అగళి	3,750	20
రొళ్ళ	3,000	50
మొత్తం	26,500	220

40 శాతం సబ్సిడీతో...

త్వరలోనే రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారానే ఆయా గ్రామాల్లో విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వేరుశనగ విత్తనానికి ధరను కూడా నిర్ణయించారు. విత్తనంపై 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. దీంతో రైతులకు తకువ ధరకే విత్తనం అందనుంది. రైతులకు గరిష్టంగా 3 బస్తాల (90 కేజీలు) విత్తనాన్ని అందించనున్నారు.

జూన్ మొదటి వారం నుంచి అనుకూలం

జూన్ మొదటి వారం నుండి వేరుశనగ విత్తనాలను విత్తడానికి అనుకూలమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జూలై 15 వరకూ విత్తనాలు విత్తడానికి మంచి అదునుగా భావిస్తున్నారు. ఏదిఏమైనా వరుణ దేవుడు కరుణించడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

త్వరలోనే విత్తన కాయల పంపిణీ



ఖరీఫ్‌లో సాగుచేయడానికి అవసరమైన వేరుశనగ విత్తనాలు ఆర్బీకేలకు సరఫరా అవుతున్నాయి. ఇప్పటికే దాదాపు 600 క్వింటాళ్ల విత్తనం వివిధ ఆర్బీకేలకు చేరింది. విత్తనం కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ కూడా మొదలైంది. అన్ని ఆర్బీకేలకు విత్తనం పూర్తిస్థాయిలో చేరిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తాం. రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను అందించనున్నారు.

– తిమ్మప్ప, ఏఓ, మడకశిర

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తులు


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పెనుకొండ: పెనుకొండ సబ్‌జైల్‌ను ఆదివారం న్యాయమూర్తులు సందర్శించారు. అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ స్థానిక న్యాయమూర్తులతో కలసి సందర్శించారు. సబ్‌జైల్‌లో బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూంలు, రికార్డు గదులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను ఆరా తీశారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పలసల సయ్యద్, సబ్‌జైల్ సూపరింటెండెంట్ అజ్గర్‌హుస్సేన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

రొళ్ల: ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించనున్న రాయితీ విత్తన వేరుశనగ కోసం రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని బీజీ హళ్లి రైతు భరోసా కేంద్రం వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. కే-6 రకం అయితే 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1710, కదిరి లేపాక్షి కే-1812 రకానికి అయితే 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1566 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టదారు పాసుపుస్తకం తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక స్పార్టన్ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళల చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జ్ఞాపికరెడ్డి మొదటి స్థానంలో నిలిచి జిల్లా చాంపియన్ షిప్‌ను కై వసం చేసుకుంది. అలాగే రెండోస్థానంలో మోక్షిత, మూడో స్థానంలో సహస్ర, నాల్గో స్థానంలో భవ్య, సహస్ర నిలిచారు. అలాగే ఓపెన్ విభాగంలో రఘునందన్ మొదటి స్థానంలో, విష్ణు కిరణ్ రెండో స్థానంలో, హర్ష మూడో స్థానంలో, మహన్ పెద్దన్న నాల్గవ స్థానంలో నిలిచారు. అనంతరం వీరికి చీఫ్ ఆర్బిటర్ శివకృష్ణ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటరీ నాగార్జున కర్ణాటకం, చెస్ కోచ్ ఆరీఫుల్లా మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో నిలిచిన 8 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారన్నారు. 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ చాంపియన్ షిప్‌లో ఓపెన్ విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అలాగే హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఉమెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో మహిళలు పాల్గొంటారన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి


పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఎం కాలనీలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్, సీపీఎం నాయకులు పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజప్ప, మల్లయ్య, రామంజప్ప, సరస్వతమ్మ, అర్షియా, నీలమ్మ, నాజియా, సమీరా, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: సీపీఎం మొట్టమొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న మాట్లాడుతూ సుందరయ్య పేద ప్రజల కోసం ప్రభుత్వాలతో రాజీలేని పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, రాజగోపాల్, నారాయణ స్వామి, గంగరాజు, మాబూ, రామకృష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బసవేశ్వర జయంతి


అలంకరణలో బసవేశ్వరుడు

హిందూపురం: వీరశైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వర జయంతిని ఆదివారం పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. బసవనగుడిలో లింగాయితుల ఇలవేల్పు ఆరాధ్యదైవం బసవేశ్వరున్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం జరిగిన సభలో లింగాయిత్ సంఘ అధ్యక్షుడు ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ కులదైవాన్ని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. తర్వాత బసవేశ్వర విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఉమేష్ కుమార్, కోశాధికారి సంపత్ కుమార్, డైరెక్టర్స్ రమేష్, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

నృసింహ జయంతికి తరలిరండి


నరసింహస్వామి మూల విరాట్

పావగడ: భక్తులకు ఇలవేల్పుగా మారిన స్థానిక కణివె లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 22న బుధవారం నిర్వహించే వైష్ణవ నృసింహ జయంతి వేడుకలకు భక్తులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో నరసింహస్వామికి విశేష పూజలు, హోమం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు ఎన్ నరసింహా తెలిపారు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప


కెంకర గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అమరాపురం: జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని కెంకర గ్రామస్తులు ఎమ్మెల్యే అభ్యర్థి సొంత గ్రామమైన ఫళారానికి వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా హేమావతి పంచాయతీలో ఎన్నికల పోలింగ్ సరళిని నాయకులతో చర్చించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనకు ఓటు వేసి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టిస్తుందని పేర్కొన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. రెండు రోజుల నుంచి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, ఈబీసీ నేస్తం తదితర డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నట్లు చెప్పారు. మాట తప్పని ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, నవీన్‌కుమార్, శివన్న, కరియప్ప, నరసింహ, శివన్న నందకిరణ తదితరులు పాల్గొన్నారు.

భూతప్ప దేవాలయంలో పూజలు

గుడిబండ: కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పుర్లహళ్లి భూతప్ప దేవాలయాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, అశ్వత్, మాజీ ఎంపీటీసీ నరసింహమూర్తి, శణ్ముక, మూర్తి, దేవరాజు పాల్గొన్నారు.

శుభకార్యం

అగళి: మండల కేంద్రంలో ఆర్ కె ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు దొక్కలపల్లి తిమ్మరాజు అల్లుడి వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రప్ప, నాయకులు సతీస్, నాటరాజు, వెంకటస్వామి, కామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు లావణ్య,మంజునాథ్‌ను ఆశీర్వదించారు.

అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 -97 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఎంతో ఆనందంగా గడిపారు. అలాగే తమకు పాఠాలు చెప్పిన గురువులను పిలిపించి వారితో కాసేపు ముచ్చటించడంతో పాటు ఘనంగా సన్మానించారు. షబ్బీర్, ఈరన్న, సురేష్, మంజునాథ, యోగానంద, నరసింహమూర్తి, మంజుల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత పీడీ మృతి


ముస్తఫా కమల్ బాషా (ఫైల్)

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముస్తఫా కమాల్‌బాషా ఆదివారం ఉదయం పట్టణంలో ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పీడీగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. పలు కళాశాలల కరస్పాండెంట్లు, ఉద్యోగులు, విద్యార్థులు, క్రీడాకారులు ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

వర్షం.. హర్షం


మధూడిలో రోడ్డుపై పారుతున్న వర్షం నీళ్లు

కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువు, కుంటలు, కందకాలల్లోకి నీరు చేరింది. వర్షం రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

గుడిబండ: మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి వర్షాలు ముందస్తుగా కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

పెనుకొండ: పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో శనివారం రాత్రి కురిసిన వర్షపాతం 167.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు డివిజన్ గణాంకాధికారి మల్లికార్జున తెలిపారు. రొద్దం 10.2, అమరాపురం 39.8, రొళ్ల 11.6, పరిగి 16.4, పెనుకొండ 14.8, సోమందేపల్లి 24.4, హిందూపురం 6.4, లేపాక్షి 32.8, చిలమత్తూరు 10.6 మి.మీ నమోదైందన్నారు.

పరిగి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడ తెరపి లేకుండా వర్షం కురిసింది. మోస్తరు వర్షంతో ప్రధాన రోడ్లన్నీ వర్షపు నీటితో నిండాయి. క్రమంలో సాయంత్రం నుంచి మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది. పరిగి చెరువుకు ఉన్న కాలువలో నీరు ప్రవహించడంతో చెరువులోకి నీరు వచ్చి చేరుతోంది. ఇలాగే వర్షం కురవాలని రైతులు కోరుకుంటున్నారు.

అగళి: మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి


పరిగి చెరువుకు కాలువ ద్వారా చేరుతున్న వర్షపు నీరు


గుడిబండలో వాన కురుస్తున్న దృశ్యం

గెలిచేదెవరు?



- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ !
- ఏ ఇద్దరు కలసినా ఇవే ముచ్చట్లు
- లెక్కలతో కుస్తీ పడుతున్న నాయకులు

హిందూపురం అర్బన్/గుడిబండ: ఎన్నికల సమరం ముగిసింది. ఫలితాలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. గెలుపై ఎవరి అంచనాలు వారివి. ఎవరి ధీమా వారిది. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడి మాత్రం ఇంకా తగ్గలేదు. ఏ ఇద్దరు కలసినా ఎన్నికల ఫలితాలు, మెజార్టీపైనే జోరుగా చర్చ సాగుతోంది.

వివిధ అంశాలపై ఆరా..

గ్రామాల వారీ తమవైపు నిలబడిన నాయకులు, ఓటర్ల లెక్కలను తెప్పించుకుంటున్న నాయకులు ప్రతి గ్రామం , ప్రతి బూత్‌లలో ఎన్నికల రోజు ఏం జరిగింది. అక్కడ ఎవరికి అనుకూలంగా ఓట్లు పడ్డాయన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నారు. ఈ సారి బాలయ్యకు ఓటమి తప్పదని, మహిళలంతా దీపికకు మద్దతుగా నిలిచారని, దీపిక స్వల్ప మెజార్టీతో గెలుస్తుందన్న చర్చలు హిందూపురం నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నాయి. ముఖ్యనాయకులే కాకుండా హిందూపురంలో గెలుపు ఎవరిదంటూ బంధువులు, మిత్రుల నుంచి స్థానికులకు ఫోన్లు వస్తున్నాయి. మరోవైపు మడకశిరలో కూడా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప గెలుపు ఖాయమన్న చర్చ సాగుతోంది. మెజార్టీపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు.

సోషల్ మీడియా గప్‌చుప్

ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలకు ఒకప్పుడు పోస్టర్లు అతికించే వాళ్లు.. ఇప్పుడు డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేస్తుండటం మనకు తెలిసిందే. అయితే 13న ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్ కాస్టింగ్ కాల్స్, రీల్స్‌తో దద్దరిల్లిన సోషల్ మీడియా ఎన్నికల ప్రచారం ముగియగానే గప్‌చుప్ అయిపోయింది. గెలుపోటములపై ఎవరూ పెద్దగా పోస్టులు పెట్టడం లేదు.